క్లుప్తంగా

తపాలా బీమా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఇందల్వాయి: తపాలా శాఖ అందిస్తున్న సేవలు, బీమా సౌకర్యాలపై నిజామాబాద్ సౌత్ డివిజన్ ఐపీవో సంతోష్ కుమార్ పోస్టల్ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ పథకం, సేవింగ్స్ పథకం, పెన్షన్ తదితర పథకాల వల్ల కలిగే లాభాలపై ప్రజలకు వివరించారు. ఎస్‌పీఎం సాయి వెంకటేష్, సిబ్బంది గోపాల్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జయంతి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా ప్రజాసంఘాల కార్యాలయం ఎదుట వడ్డే ఓబన్న 216వ జయంతి సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ.. వడ్డే ఓబన్న గొప్ప సమరయోధుడని, ప్రజల కోసం పోరాటం చేయడంలో ఎన్నడూ వెనుకడుగు వేయలేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో తమదైన సాహసాన్ని చూపారని తెలిపారు.

సాయిలు వర్ధంతి సభ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): శావులం సాయిలు ఆశయాలను కొనసాగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సాయాగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో శావులం సాయిలు 27వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈసందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ సాయిలు ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. నాయకులు గంగమల్లు, మంగల్పాట్ నారాయణ, గంగారం, గంగమల్లు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు నిధులు

జక్రాన్‌పల్లి: అర్గుల్‌లో ఓపెన్ జిమ్ కోసం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. ఇటీవల అర్గుల్‌లో దాత రఘుపతిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన స్వర్గరథాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గరథంతో పాటు గ్రామంలో ఫ్రీజర్ ఏర్పాటుకు ముందుకు రావాలని గ్రామస్తులను కోరారు. ఫ్రీజర్ ఏర్పాటు చేసిస్తే ఓపెన్ జిమ్‌కు తన స్వంత నిధులు రూ.5 లక్షలు మంజూరు చేస్తానని వ్యాఖ్యానించారు. దీంతో గ్రామానికి చెందిన ఏనుగు నర్సారెడ్డి ఫ్రీజర్ ఏర్పాటు చేయిస్తానని ముందుకు వచ్చారు. ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

అభినందనలు



తెయూ(డిచ్‌పల్లి): గవర్నర్ తమిళ సై సౌందర రాజన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులను బుధవారం వీసీ రవీందర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఇండియన్ ప్రెసిడెన్సీ ఆఫ్ జీ-20' కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడానికి 'ఒక భూమి- ఒక కుటుంబం- ఒక భవిష్యత్తు' అనే అంశంపై గవర్నర్ ఉపన్యాస పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో తెయూ విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమన్నారు.

బూత్ కమిటీల నియామకం



జక్రాన్‌పల్లి: బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ బూత్ కమిటీలను నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు నట్ట బోజన్న ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల, జెడ్పీటీసీ సభ్యురాలు పాట్కురి తనూజారెడ్డి, బ్రాహ్మణ్‌పల్లి సర్పంచ్ మాదరి లత దేవరాజ్, తొర్లికొండ సర్పంచ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు

సిరికొండ పరిధిలో..

సిరికొండ: మండల కేంద్రంతో పాటు తూంపల్లి, కొండాపూర్, చీమన్‌పల్లి తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలను బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాన్‌సింగ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడు కనిపించే నేతను కాదు

- ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా
- షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, స్థానిక నేతలు

నిజామాబాద్‌నాగారం: తాను ఎన్నికలప్పుడు కనిపించే నాయకుడిని కాదని అను క్షణం ప్రజలతోనే ఉండేవాడినని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా అన్నారు. ఖిల్లా రోడ్డులోని కింగ్స్ ప్యాలెస్‌లో షాదీ ముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటేనే బంగారు తెలంగాణ అయినట్లన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో సంక్షేమ రంగంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. తల్లి కడుపులో ఉన్న బిడ్డ మొదలుకొని వృద్ధుల వరకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గర్భిణీలకు అంగన్‌వాడి కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్నామని,, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పులు చేసి విడతల వారిగా రూ.12000 లతో పాటుగా బిడ్డకి అవసరమైన వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో కార్పొరేట్‌కు దీటుగా ఉచిత పరీక్షలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.లక్ష ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆడ పిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల ద్వారా సాయం అందిస్తున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని తెలిపారు. నిజామాబాద్ నగర ప్రజలు నన్ను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి నా బాధ్యతని పెంచారని గుర్తు చేశారు. ఎటువంటి కష్టం వచ్చినా మీ అందరికి అండగా ఉంటానన్నారు. నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్ పనుల పరిశీలన

నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే ఆర్‌యుబీ వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులు, రఘునాథ చెరువు వద్ద నిర్మిస్తున్న మినీట్యాంక్ బండ్ పనులను, నిర్మాణంలో ఉన్న మున్సిపల్ భవనాన్ని ప్రత్యేకంగా తిరుగుతూ పరిశీలన చేశారు. అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

డిచ్‌పల్లి: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిచ్‌పల్లి మండల బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎర్రసిద్దు నరేష్ మెడలో గులాబీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, పార్టీ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి, దూస్‌గాం గ్రామశాఖ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్ పనుల పరిశీలన

నిజామాబాద్‌నాగారం: నూతన కలెక్టరేట్ ప్రాంతంలో జరుగుతున్న ఐటీ హబ్ పనులను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేషగుప్తాతో కలిసి బుధవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంతకుముందు రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి ముచ్చటించారు.

సమాచారం..

నేడు ఆర్టీసీ చైర్మన్ పర్యటన

సిరికొండ: మండల కేంద్రానికి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం వస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ బుధవారం తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారని చెప్పారు.

13న ముగ్గుల పోటీలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగర మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా మేయర్ దండు నీతూకిరణ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 9గంటలకు కలెక్టరేట్ మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు బుధవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ రూ.2వేలు ఉంటుందని తెలిపారు.

18న కమ్మసంఘంలో రక్తదాన శిబిరం

నిజామాబాద్ సిటీ: ఈ నెల 18న మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మాధవనగర్ కమ్మ సంఘంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కావూరి కృష్ణారావులు బుధవారం తెలిపారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో కమ్మ కులస్తుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తున్నామని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. కమ్మ సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆయిల్‌పాంపై అవగాహన సదస్సు



హుస్సేన్‌నగర్‌లో ఆయిల్‌పాం క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్



ముల్లంగి (ఐ) శివారులో ..



గన్నారంలో సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

సాక్షి నెట్‌వర్క్ :ఆయిల్ పాం సాగుపై నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ అధికారులు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు గడించే అవకాశం ఉంటుందని, పంట మార్పిడిలో భాగంగా వరి పంటకు బదులుగా రైతులు ఆయిల్ పాం పంట సాగుకు మొగ్గుచూపాలన్నారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.4200లు సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఒక ఎకరానికి 57 మొక్కలు అవసరమవుతాయని, సబ్సిడీ విధానంలో ఒక మొక్క ధర రూ.20 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు రైతులతో కలిసి అధికారులు ఆయిల్ పాం సాగు చేస్తున్న రైతు క్షేత్రాలను సందర్శించారు.

దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలి



సుభాష్‌నగర్: కోటగిరి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంజర భూమయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిని స్కూల్ నుంచి ఆలయానికి తీసుకెళ్లి పోలీసుల సమక్షంలోనే బొట్టు పెట్టడం భావ స్వేచ్ఛను హరించడమేనన్నారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని, స్పందించని పోలీసులు, ఎంఈవో, హెచ్‌ఎం, డీఈవోలను విధుల నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు.

'గల్ఫ్ ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలి'



వినతిపత్రం అందజేస్తున్న కోటపాటి, ఎమ్మెల్సీ

ఖలీల్‌వాడి: గల్ఫ్ ఏజెంట్ షేక్ బషీర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ప్రవాసీ భారతీయుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజుకు బుధవారం వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. ఆర్‌కే ట్రావెల్స్ పేరుతో డిచ్‌పల్లిలో ఆఫీసు తెరిచి సుమారు 500లకు పైగా గల్ఫ్ నిరుద్యోగులను మోసం చేసినట్లు ఆయనకు వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, కోటపాటి నరసింహనాయుడు మాట్లాడారు. అమాయకుల నుంచి రూ.3 కోట్లకు పైగా వసూళ్లు చేసి, పరారైన ట్రావెల్స్ ఏజెంట్ షేక్ బషీర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఎడపల్లి మండలంలోని ఎమ్మెసీ ఫారానికి చెందిన షేక్ బషీర్ డిచ్‌పల్లిలో ట్రావెల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దుబాయ్, షార్జా, తదితర గల్ఫ్ దేశాలకు పంపిస్తానని డబ్బులు వసూలు చేశాడని, గతంలో కూడా గల్ఫ్‌కు పంపిస్తానని మోసాలకు పాల్పడ్డారన్నారు. కువైట్ ఉద్యోగాలు ఉన్నాయని రూ.50 వేల వరకు జీతం ఉంటుందని నిరుద్యోగ యువకులను నమ్మించినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా బషీర్‌ను అదుపులోకి తీసుకోలేదన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ



నిజామాబాద్‌అర్బన్: దక్షిణ భారత ఇన్‌స్పైర్ పోటీలకు నగరంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ఎనిమిది ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించగా కాకతీయ విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే సైన్స్‌ఫేర్‌లో జెడ్పీహెచ్ చౌటుపల్లి, విజయ్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. విద్యార్థులను డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు.

ఆరోగ్యంపై తగిన శ్రద్ధ అవసరం



హెల్త్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ భానుప్రియ

డిచ్‌పల్లి: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని ప్రముఖ గైనకాలజిస్ట్ అంకం భానుప్రియ సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కొరట్‌పల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అంకం భానుప్రియ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఎంతో మంది మహిళలను రక్తహీనత సమస్య వేధిస్తోందని, సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించ వచ్చన్నారు. విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా సొంత వైద్యం చేసుకోకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. విద్యార్థినులకు హెల్త్ కిట్లు అందజేశారు. అనంతరం విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు.

'శబ్ద తరంగిణి' ఆధ్వర్యంలో వివేకానంద జయంతి



నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సరస్వతినగర్ శబ్ద తరంగిణి కార్యాలయంలో యువజన వారోత్సవాల సందర్భంగా బుధవారం వివేకానంద జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఇంజినీర్ ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. యువత వివేకానంద చూపిన బాటలో నడవాలన్నారు. వందలో ఒకరిగా ఉండకు వందల్లో ఒకరిగా ఉండుమన్నారు. దేశానికి ఉపయోగపడని శరీరం, డబ్బు ఎంత పెరిగినా వృథాయే అన్నారు. సంస్థ అధ్యక్షుడు సేర్ల దయానంద్, పోత్నూరి లక్ష్మణ్, బొడ్డు దయానంద్, భాస్కర్, మోహన్, బొడ్డు రాజశేఖర్, నితిన్, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ నియామకాలపై విచారణ జరపాలి



నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్యశాఖలో కంటి వెలుగు డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాలలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదభట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత నెల డిసెంబర్‌లో జిల్లా వైద్యశాఖాధికారి కంటి వెలుగు కార్యక్రమానికి అవసరమయ్యే 70 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం కోసం ప్రకటన విడుదల చేయగా దాదాపు 500 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎలాంటి స్కిల్ టెస్టులు చేయకుండా వారికి కావలసిన వారిని ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ విషయం గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్తే తమను పోలీసులు తోసేశారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సంగీత
- సమస్యలపై అధికారుల నిలదీత



మాట్లాడుతున్న ఎంపీపీ సంగీత

సిరికొండ: అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ మాలావత్ సంగీత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. సరిగా విధులు నిర్వహించని గ్రామ స్థాయి అధికారులకు మెమోలు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశుసంవర్ధక , వైద్య ఇతర శాఖల అధికారుల పనితీరు సరిగా లేదని, సిరికొండ, కొండాపూర్, చిన్నవాల్గోట్, కొండూర్, గోప్యతండా సర్పంచ్‌లు రాజారెడ్డి, రమేష్, రాజు, నర్సారెడ్డి, రాంచందర్, తూంపల్లి ఎంపీటీసీ లింగంలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సమావేశాల్లో ఎంత విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో ఉండే లైన్‌మెన్లు తాము ఏదైనా సమస్యను సూచిస్తే సరిగ్గా స్పందించడం లేదని వాపోయారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎందుకు నిర్వహించడం లేదంటూ సిరికొండ సర్పంచ్ రాజారెడ్డి ప్రశ్నించారు. ఈ నెల 18 నుంచి రెండు బృందాల ద్వారా కంటివెలుగు శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. భగీరథ నీటిని రెండు పూటలా వచ్చేలా చూడాలని కొండాపూర్ సర్పంచ్ రమేష్ అధికారులను కోరారు. కొండూర్-రామడుగు మధ్యన, పాకాల-పందిమడుగు మధ్యన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు చేపడతామని పీఆర్ ఏఈ హైమద్ హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రంలో ధ్వంసమైన బైపాస్ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాజన్న, తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుణవీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య వివాదం

- రోడ్డు స్థలం విషయంలో గొడవ
- సమస్యను పరిష్కరించిన పోలీసులు



ఇరువర్గాల నేతలతో మాట్లాడుతున్న పోలీసులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో ఓ రోడ్డు స్థల విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నరేష్, ఎస్సై లింబాద్రిలు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను శాంతిప జేసి సమస్యకు పరిష్కారం చూపటంతో గొడవ సద్దుమణిగింది. వివరాలు.. గుండారం శివారులోని గుట్టపై 17 సంవత్సరాల క్రితం పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయం ఏర్పాటు చేశారు. గుట్టపై వెళ్లటానికి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం పక్క నుంచి కొంతవరకు మాత్రమే కచ్చా రోడు ఉంది. పల్లెప్రకృతి వనం పక్కన షాదీఖానా నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించి నిధులు విడుదల చేసింది. దాంతో వారు నిర్మాణం చేపట్టారు. కాగా వీరబ్రహ్మం గారి ఆలయానికి వెళ్లే దారిని సైతం అక్రమించి నిర్మాణం చేపడుతున్నారని విషయం తెలియటంతో విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు అక్కడకు చేరుకున్నారు. ఈ లోపు పోలీసులు అక్కడకు చేరుకోగా గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఉప సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, గ్రామస్తులు అక్కడికి చేరుకుని రోడ్డు స్థల వివాదంపై ఇరువర్గాలతో మాట్లాడారు. రోడ్డును ఆక్రమించుకుని నిర్మాణం చేయటం లేదని, షాదీఖానా పక్కన 25 ఫీట్ల రోడ్డు ఉందని మైనార్టీ నాయకులు పోలీసులకు తెలిపారు. వీరబ్రహ్మంగారి గుట్టపైకి వెళ్లడానికి తమకు రోడ్డును కేటాయించినట్లు గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇవ్వాలని విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు ఏసీపీకి తెలిపారు. సర్పంచ్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. రోడ్డును వదిలిపెట్టి షాదీఖానా నిర్మిస్తున్నామని వారు ఒప్పంద పత్రాన్ని ఇవ్వటంతో వివాదం సద్దుమణిగింది.

సీసీ డ్రైనేజీ పనుల ప్రారంభం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో బుధవారం సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్, మండల నిధులు రూ.4 లక్షలతో గుండారంలోని వడ్డెర కాలనీలో సీసీ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఎంపీటీసీ గంగాధర్, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డిలు ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో మార్పులు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: పదవ తరగతి పరీక్షల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో ఏడీకి వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ..ప్రశ్నా పత్రంలో 30 శాతం ఛాయిస్ ప్రశ్నలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. వ్యాసరూప ప్రశ్నలలో కూడా సెక్షన్లను పెట్టకుండా ఇచ్చిన సమయంలో అన్నీ రాయాలని పెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	56,400	వెండి (కిలో)	69,000
22 క్యారెట్స్	51,985		

- నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	5	10	క్యాప్సికం	30	50
బెండకాయ	60	90	గాజరుగడ్డ	25	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	25	40	ఆలుగడ్డ	20	35
కాకరకాయ	20	40	గోబిగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	20	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1- వీరసింహారెడ్డి 10.15
తెగింపు- 1.30,4.30,7.30,10.30
స్క్రీన్-2-వీరసింహారెడ్డి 9.45,1.00,4.15 7.30,10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1-వీరసింహారెడ్డి-8.30, 12.00,3.30, 7.00,10.30
స్క్రీన్-2-వీరసింహారెడ్డి-8.45,12.15,3.45, 7.15,10.45
స్క్రీన్-3-వీరసింహారెడ్డి-9.00,12.30,4.00, 7.30,11.00
స్క్రీన్-4- తెగింపు-9.40,12.50,4.00, 7.10,10.20

దేవి	వీరసింహారెడి
నటరాజ్	తెగింపు
లలితామహల్	ఒక్కడు
శ్రీదేవి	ధమాకా
విజయ్	వీరసింహారెడ్డి